


# పర్యావరణానికి ముప్పు ప్లాస్టిక్ సంచులు

## చక్కటి ఆలోచనతో స్పందించిన యామిని

ప్లాస్టిక్ సంచుల వాడకం మంచిది కాదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వీటి వల్ల పర్యావరణానికి జరుగుతునన హాని, రాబోయే తరాలకు జరుగుతున్న కీడు గురించి ఎవరూ ఆలోచించడంలేదు. ప్రముఖులు ఎందరో వీటిపై ఆందోళన వ్యక్త ంచేశారు. ఎటుచూసినా కాలుష్యం...వాటిని మరింతగా పెంచి పోషిస్తున్న ప్లాస్టిక్ కవర్లు. మనం పారేసిన చెత్తను తింటున్న జంతువులు..వాటితోపాటు లోపలకు చేరుకుంటున్న ప్లాస్టిక్ కవర్లు ..ఇలాంటివి ఎంతో కలవరపర్చాయని దీనికోసం ఒక మహిళ ప్రత్యామ్నాయ మార్గాలను వెతికే ఆలోచన చేసింది. ఆలోచనలోనుంచి బయటకు వచ్చిందే చేతి సంచుల తయారీ. కాగితం సంచులను తయారి చేసి అందిస్తే పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమెకు వచ్చిన ఆలోచనతోనే అందమైన చేతి సంచులు తయారవుతున్నాయి. ఈ క్రమంలో ఆమె ఒక యూనిట్‌నే ఏర్పాటు చేశారు. ఆమె పేరే కోగంటి యామిని. ఒక ఎల్ఐసి ఏజెంట్‌గా పనిచేస్తూ ఉన్న ఆమె ఈ పరిశ్రమను కూడా ఏర్పాటు చేసి పలువురికి ఉపాధిని కూడా అందించగలిగారు.

యామినిది కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు. విజయవాడకు చెందిన విజయభాస్కర్‌తో ఆమెకు 1994లో వివాహమైంది. ఆయనకు హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో ఇక్కడ స్థిరపడినట్లు చెప్పారు.

డిగ్రీ చదివిన యామిని బీమా ఏజెంట్‌గా చేరారు. ప్లాస్టిక్ సంచులపై వచ్చిన ఆందోళనను బాగా ఆకళింపు చేసుకుని , దీని వల్ల హాని ఎక్కువగా ఉందని భావించిన తాను ఏదో చేయాలన్న తపనతో ఈ యూనిట్‌కు శ్రీకారం చుట్టానని అన్నారు. కాగితపు చేతి సంచులు తయారు చేయడం వల్ల ఈ ప్లాస్టిక్ వాడకానికి తెర దించవచ్చునని అనుకుని తన భర్తతో ఈ విషయం చర్చించారు. ఆమె ఆలోచనతో ఆయన ఏకీభవించడంతో కాగితపు సంచుల పరిశ్రమ మొదలైంది. తొలుత ఖాదీవిలేజ్ ఇండస్ట్రీస్ బోర్డునుంచి యూనిట్‌కై రు 16 లక్షలు ఆర్థికసాయం తీసుకుని ఈ యూనిట్‌ను నగర శివార్లలో ఏర్పాటు చేశారు. మొదట్లో సాదా సంచుల్ని తయారు చేశామని , వాటికి వినియోగదారులనుంచి సరైన స్పందన రాకపోవడంతో నిదానంగా ఆర్డర్లు తీసుకుని ఎవరికి ఎలా కావాలో ఆ రకంగా తయారు చేయడం ప్రారంభించామని చెప్పారు. వ్యాపారం పుంజుకుంది. బహుమతులు ఇవ్వడానికి, తాంబూలాలు పంచడానికి, కిట్టీ పార్టీలకు , కంపెనీల లోగోలను ముద్రించడానికి వీలుగా ఈ సంచులను తయారు చేయడంవల్ల మంచి ఆదరణ లభించిందని చెప్పారు. ఈ సంచుల తయారీకిగానూ నాణ్యమైన క్రాఫ్ట్ పేపర్ ఉపయోగిస్తున్నామని చెప్పారు. పర్యావరణాన్ని



రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదని, వ్యర్థపదార్థాలతో తయారయ్యే ఒక రూపాయికి దొరికే ప్లాస్టిక్ సంచులను కొనడం మానేసి మూడు రూపాయల ధర ఉన్నప్పటికీ కాగితం సంచులను కొనడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు.

చేతిసంచుల తయారీ పరిశ్రమలో 12 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ చేతిసంచుల తయారీలో 60 శాతం పని యంత్రం చేస్తుండగా మిగతా 40 శాతం పని చేతులతో చేయవల్సి ఉంటుంది. తుదిమెరుగులు దిద్దే పని అంతా మహిళలే చేస్తుంటారని వివరించారు. డిజైన్లు మాత్రం ఇతరుల చేత వేయిస్తానని చెప్పారు. 5000 సంచులు కావాలన్నా వెంటనే ఇవ్వగల సామర్థ్యం తనకుందని ఆమె తెలిపారు. సాదావి, డబుల్ కలర్స్ వాటి సైజులను బట్టిధరలు ఉంటాయి. సైజు 18 /18 సెంమీ ఉండేవి వాడడానికి అనువుగా ఉంటాయని అన్నారు.

కాగా అమ్మకాలకు ఆమె పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకోవడం విక్రయించడం చేస్తున్నారు. దీనివల్ల ఎంతో సమయం కలిసి వస్తున్నట్లు చెప్పారు. తమ ఉత్పత్తులను పెంచేందుకు ఇంకా విస్తరించనున్నట్లు తెలిపారు. కాగితం సంచులపై ఇంకా ప్రజల్లో అవగాహన పెరగాలని , ఇందుకు ప్రభుత్వ బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ చేతి సంచులు కావాల్సిన వారు 98480 13683 ఫోన్‌లో సంప్రదించవచ్చు లేదంటే ఈ ఇ మెయిల్‌కు పంపవచ్చు.

